క్లుప్తంగా

ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శన



సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నల్లబెల్లి, చెన్నారావుపేట, వర్ధన్నపేట, రాయపర్తి, దుగ్గొండి, గీసుకొండ, సంగెం, పర్వతగిరి, తదితర మండలాల్లో అధికారులు, సిబ్బంది ముసాయిదా ఓటరు జాబితాను గురువారం ప్రదర్శించారు. ఆయా మండల పరిషత్, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద జాబితాను ఎంపీడీఓలు, అధికారులు ఏర్పాటు చేయించగా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు తిలకించారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 30వ తేదీ వరకు తెలియజేయాలని ఎంపీడీఓలు కోరారు. తుది జాబితాను సెప్టెంబర్ 2న అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు.

డీజే నిర్వాహకుల బైండోవర్



గీసుకొండ/ఖానాపురం : డీజే నిర్వాహకులను గీసుకొండ సీఐ మహేందర్, ఖానాపురం ఎస్సై చాగర్ల రఘుపతి సదరు తహసీల్దార్ల ఎదుట గురువారం బైండోవర్ చేశారు. తొలుత సదరు పోలీస్‌స్టేషన్లలో ఆయా మండలాల్లోని డీజే నిర్వాహకులకు వారు కౌన్సెలింగ్ చేశారు. గణపతి ఉత్సవాల వద్ద డీజే పెట్టొద్దని స్పష్టం చేశారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో సహకరించాలని సూచించారు. నవరాత్రుల ముగింపు రోజున డీజేలు పెడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. బైండోవర్ ఉల్లంఘిస్తే జరిమానాలు లేదా జైలు శిక్ష తప్పదన్నారు.

యూత్ చొరవతో రోడ్డుకు మరమ్మతు



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని శంకరతండా శివారులోని వాయిల్‌తండా రోడ్డు వర్షాలకు బురదమయం కావడంతో యువత చొరవ తీసుకుని మరమ్మతు పనులు చేపట్టి బాగుచేశారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు బోడ నరేశ్ మాట్లాడారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమయమై చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల ఇబ్బందులు తొలగించేలా మొరం పోశామన్నారు. ప్రభుత్వం స్పందించి శాశ్వత ప్రాతిపదికన బీటీ రోడ్డు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో యూత్ ఉపాధ్యక్షుడు జరుపుల నవీన్, కార్యదర్శి హలావత్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

దుగ్గొండి : మండలంలోని బొబ్బరోనిపల్లిలో నెలకొన్న తాగునీటి, రోడ్ల, డ్రెయినేజీ, తదితర సమస్యలు పరిష్కరించాలని ఎంసీపీఐ(యూ) మండల సహాయ కార్యదర్శి ఎల్లబోయిన రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం పంచాయతీ కార్యదర్శి శశిధర్‌కు గురువారం వినతిపత్రం అందజేసింది. అనంతరం రాజు సమస్యలను వివరించారు. వర్షపునీరు తాగునీటి బావిలోకి చేరుతోందని, పలుచోట్ల వీధి లైట్లు వెలగడం లేదని, బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదని, చెత్తాచెదారం వీధుల్లో పేరుకుపోయిందని, తదితర సమస్యలను ఏకరువు పెట్టారు.

యూరియా పంపిణీపై చర్చకు సిద్ధమా?

ఖానాపురం : యూరియా పంపిణీపై చర్చకు సిద్ధమా? అని కాంగ్రెస్ నాయకులు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ సవాల్ విసిరారు. మండల కేంద్రంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలోనే సరిపడా సరఫరా చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును తేల్చడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు తప్పుడు ప్రచారాలతో రైతుల్లో గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు. చర్చకు సిద్ధంగా ఉంటే కాంగ్రెస్ నాయకులు తేదీ, సమయం, స్థలం చెప్పాలన్నారు.

కేసు నమోదు

కొత్తగూడ : ఆదివాసీ మహిళపై దాడి చేసిన వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ గురువారం తెలిపారు. మండల కేంద్రంలోని జీఎల్ నగర్‌కు చెందిన పాషా అదే వీధికి చెందిన ఆదివాసీ మహిళను దుర్భాషలాడుతూ దాడి చేసి కొట్టాడని తెలిపారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పాషా మీద చట్టప్రకారం అట్రాసిటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నర్సంపేట : శివనగర్‌లోని విగ్రహం వద్ద పూజ చేస్తున్న కమిటీ బాధ్యులు



నర్సంపేట రూరల్ : గణపతి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



కొలువుదీరిన గణనాథులు

జిల్లావ్యాప్తంగా వినాయక చవితి సందర్భంగా బుధవారం గణనాథులు కొలువుదీరారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో విగ్రహాలు ఏర్పాటు చేయగా భక్తులు పూజలు నిర్వహించారు. పలు చోట్ల డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు, చిన్నారుల కోలాటాల మధ్య వినాయకుడిని మండపాలకు తీసుకొచ్చారు.

\- సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట : చెన్నారావుపేటలో..



ఖానాపురం : పూజ చేస్తున్న భక్తులు



దుగ్గొండి : గిర్నిబావిలో..



నెక్కొండ: శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో..



నల్లబెల్లి : బొల్లోనిపల్లి పాఠశాలలో..



నల్లబెల్లి : రాంపూర్‌లో..



పర్వతగిరిలో..



గీసుకొండలో..

ఉద్యమాలతోనే హక్కుల పరిరక్షణ

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాజు

దుగ్గొండి : ఉద్యమాలతోనే హక్కుల పరిరక్షణ సాధ్యమని సీఐటీయూ (బిల్డింగ్ వర్కర్స్ యూనియన్) రాష్ట్ర కార్యదర్శి కోటం రాజు స్పష్టం చేశారు. మండల కేంద్రంలో యూనియన్ స్థానిక కన్వీనర్ బోళ్ల కొమురయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల మహాసభకు రాజు అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించేలా చట్టాలను సవరణ పేరుతో నాలుగు లేబర్ కోడ్‌లు చేసిందని విమర్శించారు. కార్మికుల శ్రమను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేలా సవరించిందని తెలిఆపరు. సంక్షేమ బోర్డును ప్రైవేటు సంస్థలకు అప్పగించే కుట్ర చేస్తోందన్నారు. కార్మికుల ప్రమాద బీమాను రూ.10 లక్షలకు పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సభలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఆరూరి కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సాంబయ్య, రైతు సంఘం నాయకుడు నర్సింహారెడ్డి, జీపీ సంఘం నాయకులు బ్రహ్మచారి, కుమార్, సంపత్, భిక్షపతి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న రాజు

నైట్ పెట్రోలింగ్‌లో మహిళా కానిస్టేబుల్

నెక్కొండ : స్థానిక మహిళా కానిస్టేబుల్ అజ్మీర సరిత మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో బుధవారం అర్ధరాత్రి పెట్రోలింగ్ చేశారు. సీపీ ఆదేశాల మేరకు మండలంలో తొలిసారి మహిళా కానిస్టేబుల్‌కు విధులు కేటాయించగా ఆమె సమర్థవంతంగా నిర్వర్తించారు. మహిళా కానిస్టేబుల్ నైట్ డ్యూటీ చేయడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటివరకు మహిళా కానిస్టేబుళ్లు పోలీస్‌స్టేషన్లలో రిసెప్షనిస్టులుగా, బందోబస్తులో పాల్గొనే పరిస్థితి ఉండగా పెట్రోలింగ్ నిర్వహించడానికి అడుగులు పడ్డాయి. తాము రాత్రి విధులు సైతం నిర్వర్తించగలమని సరిత అన్నారు.



పెట్రోలింగ్ విధుల్లో కానిస్టేబుల్ సరిత

రైతులకు పరిహారం ఇవ్వాలి

● సంఘం రాష్ట్ర కన్వీనర్ చందర్‌రావు

సంగెం : తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిన్న నష్టపోయిన రైతులను పరిహారం అందించి ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గవిచర్లలో వర్షాలకు దెబ్బతిన్న పత్తి, మొక్కజొన్న పంటలతో పాటు కూరగాయల, పండ్ల తోటలను గురువారం ఆయన ఆధ్వర్యంలోని సందర్శించి నష్టాన్ని అధ్యయనం చేసింది. అనంతరం చందర్‌రావు మాట్లాడారు. వర్షాలకు వందలాది ఎకరాల పంటలు దెబ్బతిన్నాయని, బాధిత రైతులు వేదనకు గురవుతున్నారని చెప్పారు. దెబ్బతిన్న పంటలకు పత్తి, మొక్కజొన్న ఎకరాకు రూ.25 వేలు, కూరగాయలు, పండ్ల తోటలకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం అందించాలని సూచించారు. పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు బాషిపాక రమేశ్, నాయకులు బల్సుకూరి నర్సయ్య, మాదం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న నాయకులు

ఆర్థికసాయం



ఖానాపురం : మండలంలోని మనుబోతులగడ్డకు చెందిన దున్నపోతుల వ్యాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడితో కలిసి బీటెక్ చదువుకున్న జయముఖి ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ఫ్యాకల్టీ, విద్యార్థులు గురువారం రూ.50 వేల సాయం అందజేశారు. తొలుత వ్యాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంధ్యారాణి, మస్తాన్, సుకుమార్, కల్యాణ్, సుప్రియ, రమణ, వెంకటేశ్వర్లు, అరుణ్, ఫిరోజ్, సాయి, భరత్, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పీటీసీ ప్రాంగణంలో మొక్కకు నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, మేయర్ సుధారాణి

● ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

మామునూరు : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అంతర్గత రోడ్లు, డ్రెయినేజీల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. గురువారం 43వ డివిజన్ మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో బల్దియా సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కల్వర్టు, డివైడర్ నిర్మాణ పనులను పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ, నగర మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్ అరుణలతో కలిసి ఎమ్మెల్యే శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులను ప్రారంభించారు. అంతకుముందు ఎమ్మెల్యే నాగరాజు మొక్కలు నాటి వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విక్టర్, ఇనుగాల జోగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ వేడుక

గూడూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ సమీపంలో గురువారం వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల అధ్యక్షుడు గుర్రం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడారు. వికలాంగులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశార. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి రుద్ర తిరుపతి, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు పాశం సాంబయ్య మాదిగ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నియామకం

ఖిలా వరంగల్ : వరంగల్ జిల్లా మున్నూరు కాపు యూత్ అధ్యక్షుడిగా ఫోర్ట్ రోడ్డు విద్యానగర్ కాలనీకి చెందిన గై క్రాంతికుమార్ నియామితులయ్యారు. గురువారం మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్ నియామక పత్రాన్ని క్రాంతికుమార్‌కు అందజేశారు. కాపు యువత ఐక్యతకు మరింతగా కృషి చేస్తానని పేర్కొన్నారు.



క్రాంతి కుమార్

నివాళి

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడ గ్రామానికి చెందిన బాదావత్ సువాలి అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ దుంకదువ్వ రంజిత్, జిల్లా కార్యదర్శి ఎర్ర రాజు గురువారం నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి భావాని, రఘు, కోరె మల్లయ్య, కోరె రాకేశ్, బాదావత్ సంతోష్, లావుడ్య శివ, భూక్య నవీన్, బాదావత్ నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు రక్షణ కరువు

కొత్తగూడ : మండలంలోని ఆదివాసీలకు రక్షణ కరువైందని తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆగబోయిన రవి గురువారం ఒక ప్రకటనలో ఆందోళన వెలిబుచ్చారు. కొన్ని రాజకీయ పార్టీల అండతో మహిళపై దాడి చేశారని ధ్వజమెత్తారు.

చీకట్లో గుడిసెవాసులు

ఖిలా వరంగల్ : వరంగల్ 43వ డివిజన్ పరిధిలోని జక్కలొద్ది గుడిసెవాసులు గురువారం చీకట్లో గడిపారు. వివరాలిలా.. గుడిసెవాసులు మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యుత్ స్తంభ నుంచి కనెక్షన్ తీసుకున్నారు. స్తంభంపై లోడు ఎక్కువ పడటం వల్ల తరుచుగా విద్యుత్ సమస్య వస్తోంది. గమనించిన విద్యుత్ అధికారులు గురువారం సాయంత్రం జక్కలొద్ది గుడిసెలకు వెళ్లే విద్యుత్ కనెక్షన్లను తొలిగించారు. ఈ క్రమంలో గుడిసెవాసులు చీకట్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని గుడిసెవాసులు విద్యుత్ అధికారులను కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ

మామునూరు : వరంగల్ బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో సెప్టెంబర్ 24, 25 తేదీల్లో నిర్వహించనున్న ఐఈఈఈ స్పైరో 7.0 జాతీయ స్థాయి ఫ్లాగ్‌షిప్ ఈవెంట్ పోస్టర్‌ను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ ముస్తాక్ హైమద్, బ్రాంచ్ కౌన్సెలర్ బైరపాక ప్రశాంతి ఆవిష్కరించారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

● డిప్యూటీ డెమో అనిల్ కుమార్

నర్సంపేట రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డెమో ఈదురు అనిల్ కుమార్ కోరారు. నర్సంపేట మండలంలోని భానోజీపేట పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. చిన్నారుల కోసం చేపట్టే వాక్సినేషన్, తదితరాలపై అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో విధి నిర్వహణలో వైద్యులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.

బోడతండాలో..

నర్సంపేట : మండలంలోని జల్లి గ్రామ శివారులోని బోడతండాకు చెందిన ఓ వ్యక్తి డెంగీ బారిన పడగా తండాను డిప్యూటీ డెమో అనిల్‌కుమార్ సందర్శించి తండావాసులకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు, విరోచనాలు, తదితర అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని చెప్పారు. డెంగీ బాధితుడిని కలిసి పలు సూచనలు అందించారు. సిబ్బందితో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ నంద, హెల్త్ ఎడ్యుకేటర్ వసంత, ఆరోగ్య కార్యకర్తలు కవిత, శివాజీ, లలిత, ఆశ కార్యకర్తలు సునీత, లలిత, పద్మ, రేణుక, రాధ, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్ : చిన్నారులకు వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డెమో అనిల్ కుమార్

ఖాతాదారులకు మెరుగైన సేవలే ధ్యేయం

● బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ వంశీకృష్ణ

నర్సంపేట : బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా అధికారులు, సిబ్బంది పని చేస్తున్నారని మేనేజర్ మూడు వంశీకృష్ణ తెలిపారు. పట్టణంలోని ఆ బ్యాంకు శాఖ కార్యాలయంలో గురువారం మొదటి వార్షికోత్సవ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ వంశీకృష్ణ కేక్ కట్ చేసి మాట్లాడారు. బ్యాంకు ఏర్పాటు చేసిన తొలి సంవత్సరమే 1100 మందికి ఖాతా అందించినట్లు తెలిపారు. బంగారు ఆభరణాలపై, వాహనాల కొనుగోలుకు మాత్రమే కాకుండా గృహ, విద్యా రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఖాతాదారుల సహకారంతో మరింత ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఉమేశ్, క్యాషియర్ వినయ్‌సాగర్, క్లర్క్ సౌజన్య, గోల్డ్ అప్రైజర్లు భిక్షమాచారి, సందీప్, డీఎస్పీ కేశబోయిన వంశీ, సబ్ స్టాఫ్ వినయ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేనేజర్ వంశీకృష్ణ

‘విద్యుత్’ అమరవీరుల స్ఫూర్తితో పోరాడాలి



నర్సంపేట : విద్యుత్ పోరాట అమరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నర్సంపేట/నల్లబెల్లి/సంగెం : విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఈసంపెల్లి బాబు, ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, సీపీఐ జిల్లా నాయకుడు చింతకింద కుమారస్వామి, తదితరులు కోరారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ఘటనలో అమరులైన విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి, రామకృష్ణ చిత్రపటాలకు 25వ వర్ధంతి సందర్భంగా నర్సంపేట, నల్లబెల్లి, సంగెం మండలాల్లో వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబు, రమేశ్, కుమారస్వామి, తదితరులు మాట్లాడారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ జరిగిన ఉద్యమంలో నాటి పాలకులు పోలీసులతో కాల్పులు జరిపించి విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి, రామకృష్ణలను పొట్టన పెట్టుకున్నారని తెలిపారు. ఆ చర్యకు గుణపాఠంగా నాటి ప్రభుత్వాన్ని తదనంతర ఎన్నికల్లో ప్రజలు గద్దె దింపారని గుర్తు చేశారు. పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమౌతాయని స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరబోయిన కుమారస్వామి, పరికి మధుకర్, అన్వర్, పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్, ఎంసీపీఐ(యూ) డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబురావు, వంగల రాగసుధ, జిల్లా కమిటీ సభ్యుడు కేశెట్టి సదానందం, సీపీఐ మండల కన్వీనర్ కడియాల క్రాంతి కుమార్, ఎంసీపీఐయూ మండల కార్యదర్శి ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : ఓంకార్ భవన్‌లో నివాళులర్పిస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు



నల్లబెల్లి : నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కేంద్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

● రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్

ఖిలా వరంగల్ : కేంద్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని, యూరియా కొరత లేకుండా రైతులకు సకాలంలో అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వరంగల్ రైతు సంఘం భవనంలో ఊరటి అంశాల రెడ్డి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు కోటి ఎకరాలకు పైగా అన్ని పంటలు సాగు చే స్తున్నారని, యూరియా కోసం రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని, ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్) సంఘాల భవనాల ఎదుట రోజుల తరబడి ఎదురు చూస్తే ఒక బస్తా ఇస్తున్నారని అందోళన వ్యక్తం చేశారు. పంటకు సరైన సమయంలో యూరియా అందించకపోతే దిగుబడి తగ్గి పోయే అవకాశాలు ఉన్నాయని, తక్షణమే రైతుల కు సరిపోయేంత యూరియా జిల్లాలో పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఓదెల రాజయ్య, కత్తి సుధాకర్, సిరుల రవీందర్,సముద్రాల బిక్షపతి, అంబయ్య, సాంబయ్య, బరుపటి రవీందర్, రాజేందర్, రాజు,క్రీడల ప్రభాకర్, బోనాల గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నర్సంపేట : భారీ వర్షాలు కాస్త భారీ వర్షాలుగా మారే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెన్నారావుపేట తహసీల్దార్ దిలావర్ మహమ్మద్ ఆబిద్ అలీ కోరారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎడ తెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వాహనదారులు, రైతులు, ప్రయాణికులు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ బోర్డులకు దూరంగా ఉండాలని తెలిపారు. చలి తీవ్రత నేపథ్యంలో చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కురుస్తున్న వర్షాల కారణంగా వర్షపు నీళ్లు రోడ్లపై ప్రవహిస్తున్నాయని మ్యాన్ హోల్లు, డ్రైనేజీలను గుర్తించి జాగ్రత్తలు పాటిస్తూ దాటాలన్నారు. సెల్ఫీల కోసం ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రదేశాలకు వెళ్లి ప్రమాదాలకు వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దని తెలిపారు. బావుల వద్ద జాగ్రత్త వహించాలని తెలిపారు.